నేలమట్టమైన భవనం



24 గంటల్లో భారీ భవనాలను కూల్చివేసిన హైడ్రా

● ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణదారుల గుండెల్లో గుబులు

నిజాంపేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువులో భారీ బహుళ అంతస్తుల భవనాన్ని శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు హైడ్రా అధికారులు సిబ్బందితో కలిసి పూర్తిగా నేలమట్టం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వెలిసిన మూడు భారీ భవనాలను 24 గంటల సమయంలో నేలమట్టం చేయడంతో అక్రమ నిర్మాణదారుల గుండెల్లో గుబులు పుట్టింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో సర్వేనెంబరు 134లో రెండు జంబో క్రేన్‌లు, రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో గురువారం తెల్లవారుజాము నుంచి కూల్చివేతలు మొదలుపెట్టి, శుక్రవారం ఉదయం వరకు పనులు చేపట్టారు. మూడు అపార్టుమెంట్‌లను నేలమట్టం చేశారు. ఎర్రకుంట చెరువు మొత్తం 3.10 ఎకరాలు విస్తీర్ణంలో ఉండగా, కొందరు నిర్మాణదారులు 360 గజాల చొప్పున విభజించి, మూడు ప్రాంతాల్లో మొత్తం 12 వందల గజాల్లో 5 ఫ్లోర్ల వరకు నిర్మాణం చేపట్టారు. ఇంతకాలం చెరువు పక్కన ఉన్న ప్రైవేట్ సర్వే నంబర్ల ఆధారంగా అధికారుల అండదండలతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. మొత్తానికి ఈ కూల్చివేతలతో భవన నిర్మాణదారుల్లో భయం మొదలైంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరికొన్ని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించడానికి హైడ్రా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది.



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

కళాధర్‌నగర్‌లో రూ. 6.5 లక్షలతో డ్రైనేజీ పైపులైన్

ముషీరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కళాధర్‌నగర్ కాలనీలో రూ. 6.5 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపనులను కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైపులైన్ నిర్మాణంతో కళాధర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, కళాధర్‌నగర్ కాలనీ యూత్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మెట్టు వాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలకు పంపించండి

● మంత్రి దామోదర రాజనర్సింహకు ఉపాధ్యాయుల వినతి

చిక్కడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానికతను బట్టి తమను సొంత జిల్లాలకు పంపించాలని ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి దామోదర రాజనర్సింహను మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. జీవో నంబర్ 317 బాధితుల సమస్యలు పరిష్కరించి, స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఉపాధ్యాయులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కవిత, అలివేలు, షమీమ్, యాస్మిన్ సుల్తానా, పర్వీన్‌బాను తదితరులు ఉన్నారు.

'కలుషిత నీటి సమస్య పరిష్కారంలో అధికారులు విఫలం'

రాంనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి విఫలమయ్యారని మాజీ కార్పొరేటర్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పి. బాల్‌రాజ్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం చిక్కడపల్లి, వేంకటేశ్వరస్వామి ఆలయం వీధి, సోప్ ఫ్యాక్టరీ వీధి, ఈశ్వర్‌రెడ్డి వీధి, బృందావన కాలనీ తదితర ప్రాంతాలలో టీడీపీ నాయకులు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈశ్వర్‌రెడ్డి వీధిలో 15 రోజులుగా డ్రైనేజీ లీకేజీతోపాటు నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, నాయకులు శంకర్, రమేష్‌గౌడ్, సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయి ప్రధానిగా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం గాంధీనగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రత్నసాయిచంద్ మాట్లాడుతూ.. విలువలతో కూడిన రాజకీయాలు నడిపిన మహనీయుడు వాజ్‌పేయి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, జి. శ్రీకాంత్, వీఎస్టీ రాజు, ఎం. ఉమేష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. దోమలగూడ ఫీడర్ పరిధిలో మార్కెట్, జేబీ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు, గెలాక్సీ ఫీడర్ పరిధిలో విజయాడయాగ్నస్టిక్ లేన్, మదీనా స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

లక్ష్మీఉప్పలమ్మకు మారుబోనం సమర్పణ

చిక్కడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్‌లోని లక్ష్మీఉప్పలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం మారుబోనం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వై. సంజీవరెడ్డి, కమిటీ సభ్యులు పవన్‌కుమార్, ఎంఎస్ రాధ, ఎంఎస్ పద్మ, సోలేటి భానుమతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం తగదు : ఎమ్మెన్

రాంనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, బీఆర్‌ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది తగదని బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ పటిష్ఠంగా ఉంటుందన్నారు. పార్టీకి 50 లక్షల సభ్యత్వం, లక్షలమంది నాయకులు, కార్యకర్తల బలం ఉందని, వారందరికీ కేసీఆర్‌పై నమ్మకం ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ను బలహీనపరచడానికి కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు.

'పటాన్‌బస్తీలో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు'

ముషీరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పటాన్ బస్తీలో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. మార్టినెట్ హైస్కూల్ సమీపంలో సమస్యను గుర్తించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

రాంనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో డ్యాన్స్‌లు చేయండి అంటూ మహిళలను అవమానపరిచిన మాజీ మంత్రి కేటీఆర్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా సెల్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం అంబర్‌పేటలోని శ్రీరమణ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కేటీఆర్ మహిళలను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. మహిళలను అవమానించిన కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు శంతమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.





అంబర్‌పేట శ్రీరమణ, ఇందిరాపార్కు, చౌరస్తాల్లో కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరాపార్కు చౌరస్తాలో..

కవాడిగూడ: కేటీఆర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని మహిళలకు క్షమాపణ చెప్పాలని ముషీరాబాద్ నియోజకవర్గం ఎ అండ్ బి బ్లాక్ అధ్యక్షుడు వీడీ కృష్ణ, అంజియాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు చౌరస్తాలో కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఎ-బ్లాక్ మహిళా అధ్యక్షురాలు మధుమతి, కవాడిగూడ మహిళా అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేఆర్‌కే ప్రసాద్, మారిశెట్టి నర్సింగ్‌రావు, పోతరాజు భాస్కర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఐఈఆర్‌పీల సమస్యలను పరిష్కరించాలి

● ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రాంనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ పిల్లలకు, వారికి విద్యాబోధన చేస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్(ఐఈఆర్‌పీ) సమస్యలను పరిష్కరించాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యా హక్కు - సవాళ్లు - ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుల అంశంపై సదస్సు జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో దివ్యాంగ పిల్లలకు 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విద్యాబోధన చేస్తున్న 756 మంది ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రస్తుతం డీఎస్సీ-2024లో ప్రత్యేక ఉపాధ్యాయులకు ఎస్‌జీటీ, ఎస్‌ఏ పోస్టుల నియామకాలలో వెయిటేజీ మార్కులను కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ ఎం. కోదండరాం మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిలివేరి వెంకటేశం, కె. కిరణ్ కుమార్‌రెడ్డి, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు సత్కారం



కోదండరాంను సత్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

రాంనగర్/కవాడిగూడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాంను టీజేఎస్, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య, నగర ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీసీ సెల్ నగర అధ్యక్షుడు ఎస్. జస్వంత్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య గాంధీనగర్, కవాడిగూడ డివిజన్ల అధ్యక్షులు రవియాదవ్, అజయ్‌గౌడ్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ముఠా గణేశ్, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు అంబటి మల్లయ్య పాల్గొన్నారు.



వరలక్ష్మీ పూజలో మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిరెడ్డి, మహిళలు



బతుకమ్మకుంట మైసమ్మ దేవాలయంలో వరలక్ష్మి పూజలో ఆలయ కమిటీ చైర్మన్ శివకుమార్, భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజ

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో శుక్రవారం వరలక్ష్మీ పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. బతుకమ్మకుంట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

అంబర్‌పేట మహాకాళి ఆలయంలో వరలక్ష్మి పూజ నిర్వహించారు. రాంనగర్, జెమినీ కాలనీలో పోచమ్మ ఆలయాలు, అడిక్‌మెట్ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆయా ఆలయాల కమిటీల చైర్మన్‌లు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో..

చిక్కడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మి వ్రతం సందర్భంగా చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 ఏఎంసీ ప్రవీణ్‌చంద్ర, మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. టాక్స్ ఇన్‌స్పెక్టర్ అమరసింహారెడ్డి, ఈవో రామాంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికురాలి నగలు చోరీ చేసిన వ్యక్తికి రిమాండ్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగలను చూపిస్తున్న డీసీపీ బాలస్వామి

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి నగలు చోరీ చేసిన వ్యక్తిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 15 తులాల బంగారు, 20 తులాల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో తూర్పు మండలం డీసీపీ బి. బాలస్వామి, అడిషన్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శంకర్, సీఐ లింగేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరి ఖని పెద్దపల్లి జిల్లాకు చెందిన సరిత, శంకర్ దంపతులు. సరిత అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఈనెల 5వ తేదీన ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం తిరిగి గోదావరి ఖని వెళ్లే బస్సును ఎంజీబీఎస్‌లో ఎక్కింది. బ్యాగ్‌ను సీటులో పెట్టి కిందకు దిగి తమ్ముడు శ్రీకాంత్‌తో మాట్లాడుతోంది. సిద్దిపేట్ జిల్లా, హుస్నాబాద్‌కు చెందిన కంది సంపత్ రెడ్డి(48) సరిత బ్యాగ్‌లో ఉన్న నగలు అపహరించి పారిపోయాడు. ఇంటికి వెళ్లిన తర్వాత ఆమె బ్యాగ్ చూసుకోగా అందులో నగలు కనిపించలేదు. వెంటనే విషయం తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి చెప్పగా అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు సంపత్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.

దొంగపోలీస్ అరెస్ట్

● దొంగనోట్ల తనిఖీ అంటూ బెదిరించి దారిదోపిడీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసనంటూ దారిదోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 95 వేలు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..

బేగంబజార్, సుల్తాన్ బజార్, అఫ్జల్‌గంజ్, కుల్సుంపురా, లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో ఇటీవల వరుసగా దారిదోపిడీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టారు. పోలీసు అధికారిగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి రోడ్డుమీద వెళ్తున్న వారిని బెదిరిస్తూ.. మీరు నకిలీ కరెన్సీ (దొంగనోట్లు) తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చిందని, అందుకే మఫ్టీలో తనిఖీ చేస్తున్నామని నకిలీ ఐడీతో వారిని బురిడీ కొట్టిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్ ఇరానీ గల్లీలో ఉండే.. ఇరానీ ముఠాకు చెందిన జాఫర్ అలీ అలియాస్ లంబు అని తేలింది. ఇతను పలు నగరాల్లో తిరుగుతూ, వ్యాపార ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తాడు. నగదు రవాణా చేసేవారిని గుర్తించి రహస్యంగా ఫాలో అయి, పోలీస్ అంటూ బెదిరిస్తాడు. మీవద్ద నకిలీ కరెన్సీ ఉందని తనిఖీ చేయాలని నమ్మిస్తాడు.

ఈ క్రమంలో వారి దృష్టి మరల్చి నగదు లేదా బంగారం దోచుకొని ఉడాయిస్తాడు. ఇటీవల వరుసగా ఐదు కేసులు నమోదవడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం బేగంబజార్ పోలీసులతో కలిసి అతడిని అరెస్టు చేశారు.

మౌంట్ ఎల్బ్రస్‌పై ఎగిరిన మువ్వన్నెల జెండా

● యూరప్‌లో అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించిన దుండిగల్ యువకుడు

దుండిగల్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కఠోర సాధనతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించాడు బౌరంపేట్ గ్రామానికి చెందిన తులసిరెడ్డి అనే యువకుడు. 78వ స్వాతంత్ర దినోత్సవం రోజున యూరప్ ఖండంలో అతిపెద్దదైన (5,642 అడుగుల ఎత్తైన) మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించి జై భారత్ అంటూ నినదించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎవరెస్ట్ పర్వతాన్ని తక్కువ సమయంలో అధిరోహించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019లో సముద్ర మట్టానికి 6,153 మీటర్ల ఎత్తులో ఉన్న స్టాక్ ఇంగ్రీ అనే మంచు పర్వతాన్ని మైనస్ 15 డిగ్రీలలో, 2021లో 4190 అడుగుల ఎత్తున ఉన్న కాశ్మీరీ గ్రేట్ లెగ్స్ శిఖరాన్ని, 2013లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించినట్లు తెలిపారు.



ఎల్బ్రస్ పర్వతంపై జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న తులసిరెడ్డి



అనిల్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న వినోద్‌యాదవ్ తదితరులు

యాదవులు అన్ని రంగాల్లో ముందుండాలి

బర్కత్‌పుర, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో ముందుండాలని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. కాచిగూడ డివిజన్‌కు చెందిన యాదవ సేవా సంఘం ప్రతినిధులు జాంబాగ్ యాదవ సంఘం భవన్‌లో అనిల్‌కుమార్‌యాదవ్‌ను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం ప్రతినిధులు పి. వెంకటేష్, నందకిషోర్, పాండు, కిషన్, సి. వినోద్, రవియాదవ్, జె. వెంకటేష్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడండి

● రాజ్యసభ సభ్యుడు డా. కె లక్ష్మణ్



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న లక్ష్మణ్

తిరుమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ హిందుత్వ పవిత్రతను కాపాడేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశానన్నారు. భక్తుల కానుకలను హిందూ ధర్మప్రచారం, ఆలయాల నిర్మాణం కోసం ఖర్చు చేయాలన్నారు. గతంలో తిరుమలలో అతి పురాతన కట్టడమైన పార్వేటమండపాన్ని తొలగించడాన్ని తాను, స్థానిక బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తప్పుబట్టామన్నారు. పార్లమెంట్‌లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ ఆనాటి అధికారులు విస్మరించారన్నారు. అలిపిరిలో ఉన్న పాదాల మండపాన్ని అయినా కాపాడాలని టీటీడీ ఈవో, అదనపు ఈవోకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ప్రకృతిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ సంకల్పమైన వికసిత్ భారత్ సాకారం కావాలని స్వామి వారిని ప్రార్థించానన్నారు.

బ్రాహ్మణ యువత సివిల్స్ ఉద్యోగాలపై దృష్టి సారించాలి

నల్లకుంట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ యువత సివిల్స్ ఉద్యోగాలపై దృష్టిసారించాలని ఏపీ రిటైర్డ్ డీఐజీ వైవీ సుబ్బారావు సూచించారు. శుక్రవారం న్యూ నల్లకుంటలోగల బ్రాహ్మణ విద్యార్థి వసతిగృహంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని ప్రముఖులు ఏపీ ఇండస్ట్రీస్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. పి. రామకృష్ణారావు, విద్యావేత్త గుండమరాజు శ్రీనివాస్‌రావును వైవీ సుబ్బారావు సత్కరించారు. కార్యక్రమంలో హాస్టల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామారావు, కోశాధికారి ఆర్. ఎస్. కె. భూపాల్‌రావు, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, కోదాటి యుగంధర్, వార్డెన్ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వండర్ బుక్ ఆఫ్ రికార్డు అందుకుంటున్న మిమిక్రీ శ్రీనివాస్

78 రకాల ధ్వనులు.. 9 నిముషాల 35 సెకన్లలో..

● వండర్ బుక్ ఆఫ్ రికార్డు నెలకొల్పిన మిమిక్రీ శ్రీనివాస్

బర్కత్‌పుర, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయిన సందర్భంగా ఎం. శ్రీనివాస్ మిమిక్రీలో 78 రకాల ధ్వనులను అతి తక్కువ సమయంలో పూర్తిచేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. శుక్రవారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో జరిగిన మిమిక్రీ ప్రదర్శనలో ఈ రికార్డు నెలకొల్పారు. 15 నిముషాలలో 78 రకాల ధ్వనులు వినిపించాల్సి ఉండగా కేవలం 9 నిముషాల 35 సెకన్లలో పూర్తి చేసిన మిమిక్రీ శ్రీనివాస్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ శ్రీనివాస్‌కు జ్ఞాపిక, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు జి.ఎస్. గోపాల్‌రెడ్డి, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి రామన్‌గౌడ్, కరాటే మాస్టర్లు అమృతరెడ్డి, జగదీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

రాంనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సర్వసభ్య సమావేశం వీఎస్టీ యూనియన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జగదీష్, కోశాధికారిగా వెంకట్రావ్, ఉపాధ్యక్షులుగా బల్లా ప్రశాంత్, ఎస్.వి.రెడ్డి, శ్రీనివాస్, సబ్దాద్, తిరుపతి, సీతా బాలకృష్ణ, రాజు, కరుణాకర్‌ను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నరేంద్రయాదవ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

వర్షానికి వివేక్‌నగర్‌లో కూలిన చెట్టు

● పలు ఇళ్లలో కాలిపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు

చిక్కడపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వివేక్‌నగర్‌లోని హనుమాన్‌టెంపుల్ లేన్‌లో ఓ బారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో పలు ఇళ్లలో ఫ్రిజ్‌లు, కూలర్‌లు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అధికారులు చెట్టును తొలగించి, శుక్రవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గురువారం రాత్రంతా ఆ ప్రాంతాల్లో కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.